

# సూరదాస్ కథ

సూరదాస్ మొదట సూరత్‌లో ఒక దుకాణంమీద రైటరుగా ఉండేవాడు. హఠాత్తుగా పరారై బొంబాయిలో తేలి, అక్కడో ఇంగ్లీషు హోటలులో వెయిటరుగా చేరాడు. నీలాగే డైలాగులూ, సాంగులూ, కథలూ, రాసేవాడు తీరికవేళలో. ఇలా ఉంటూ ఉండగా రోజూ ఆ హోటలుకి కాఫీతాగవచ్చే ఒక డిస్ట్రిబ్యూటరు కొడుకుతో పరిచయం కలిగింది. అదెలాగంటావేమో. ఇంగ్లీషుహోటేలు కదూ మరి. అందుకని అక్కడ వెయిటర్‌లంటే మామూలు సర్వర్లులా సామాన్యులు కారు. మాన్యులు. డైలాగు గుర్తుంచుకో బాగుంటుంది. ఏం కాఫీ తాగబోయే వారికి కూడా వాళ్ళంటే ఒకరకమైన భయభక్తులుండేవి. బేడకాఫీ తాగి, పావలా 'టిప్' అంటే బహుమానం ఇచ్చి, అణా ఎత్తు సలాం పుచ్చుకు మురిసిపోతారులే. కాఫీ బాగుండకపోయినా ఫర్వాలేదనుకో. ఈ హోటేలుకి

లాలారాం అనే డిస్ట్రిబ్యూటరు కొడుకు రోజూ వచ్చేవాడు. అతను ఫలానా అని సూరదాసు పసికట్టేశాడు. అక్కణ్ణించి అతనికి సకల మర్యాదలూ చేయడం మొదలెట్టేడు. కాఫీ అడిగిన 30 నిముషాలకల్లా కలిపి తెచ్చిచ్చేవాడు. పావలా టిప్ ఇస్తే రూపాయెత్తు సలాంపెట్టి "ఆప్‌కే గులాం జనాబ్." అన్నంత పని చేసేవాడు.

లాలారాం కొడుక్కి ఆనందం పట్టశక్యం కాక, వత్సా వరమడుగు అన్నాడు హిందీలో.

"సినిమా ఛాన్సు" అన్నాడు సూరదాసు దర్జాగా.

"అది తప్పు" అన్నముక్క అనడం పొరపాటున మర్చిపోయిన ఆ డిస్ట్రిబ్యూటరుడు నాలిక్కరుచుకుని, ఇది వీడి అదృష్టంలే అనుకుని, సరే రేపురా మాపురా అని కొన్నాళ్ళు తిప్పి, చివరకు ఒకరోజున తండ్రి ఎదుట నిలబెట్టి తనమాట నిలబెట్టుకున్నాడు.

ఇంగ్లీషు హోటలు వారికిచ్చే వాగ్దానాలు అవశ్యం నిలబెట్టుకోవలసినవి గదా!

సరే, లాలారాంగారు ఆవేళ మంచి హుషారుగా ఉన్నారు. సూరదాసును చూస్తూనే ఏం కావాలన్నారు.

"సినిమాఛాన్సు" అన్నాడు సూరదాసు ముక్తసరిగా.

"ఎందులో? యాక్టింగా, రాయడమా, ఫొటోగ్రఫీయా, డైరెక్షనా? ఏమిటి?" అన్నాడు లాలారాం.

"ఏదేనా సరేండి. అన్నీ చెయ్యగల్ను అందుకే చెప్పలేదు". అన్నాడు సూరదాసు ఠీవిగా.

లాలారాంగారు మురిసిపోయాడు ఈ ఆసామి తెలివితేటలకు. ఫలానా అని చెబితే 'అయ్యో అందులో కాళీలేదు' అని చెప్పి తప్పించు

కోవడం లాలారాంకు అలవాటు. ఆ సంగతి సూరదాసుకు తెలుసు.

"ఇన్నాళ్ళకి తెలివైనవాడిని చూశాను, నీకేమివ్వడానికి నాకభ్యంతరం లేదుగాని, కొత్తవాడివి కాబట్టి కొన్నాళ్ళు కథలూ, డైలాగులూ, పాటలూ రాయి." అన్నాడు లాలారాం.

"పోనీ డైరెక్షన్ చెయ్యమనరాదూ నాన్నా?" అన్నాడు పక్కనే ఉన్న అతని కుమారుడు.

"ఏదేనా ఒకటే అనుకో. నాకభ్యంతరం లేదుగాని, డైరెక్టరుకి ఇంకొంచెం ఒడ్డూ పొడుగూ ఉండాలి" అన్నాడు లాలారాం.

ఆ తరవాత నాలుగైదు ప్రశ్నలు వేశాడు నిగ్గు తేల్చుకోడానికి.

"సూర్‌దాస్‌జీ! రామాయణం చదివారా?"

"విన్నానండి. చిన్నప్పుడు మాబామ్మ ఆ కథంతా చెప్పేసింది. అనక, ఇంక చదవడం ఎందుకని ఒరిజనల్ చదవలేదండి."

"వెరీగుడ్ చాలు. బాల్యంనుండీ రామాయణం అంటే అభిమాన గ్రంథం అన్నమాట. మీరు డైరెక్టరయ్యాక ఈ పాయింటుకి పబ్లిసిటీ ఇద్దాం. 'ఇండియన్ కల్చర్ ఇపుడు ఫాషన్‌లెండి!' .... సరే వాల్మీకి రాసినది యింకేమన్నా చదివారా?"

"ఏవో చాలా చదివానండి గుర్తులేదు."

"ఫరవాలేదు. మీరు ఇపుడు సినిమా రైటరు. జాగ్రత్తగా ఈ ప్రశ్నకు జవాబివ్వండి. రామాయణం ఎండింగులో ఏమౌతుంది? సీత దొరుకుతుందా?"

సూర్‌దాసు ఆలోచించాడు. "ఏంచెప్పగలమండి? మీరు ఇలా హఠాత్తుగా అడిగితే. స్క్రిప్టునిబట్టి ఉంటుంది."

"ఒకొక్క జపాన్‌చిత్రాన్ని లేక ఇటాలియన్ చిత్రాన్ని ఎన్ని ఇండియన్ ఫిలిములకి వాడొచ్చు?"

"కనీసం ఆరు కథల్లోకి లాగొచ్చునండి" అన్నాడు సూర్‌దాస్ వినమ్రత ఉట్టిపడేలా.

"వండ్రఫుల్" అని ఎగిరి గంతెయ్యబోయాడు లాలారాం. మనిషి లావైనందువల్ల అది సాధ్యపడలేదు.

"ఒకసీనులో హీరోయిన్, తల్లిని లాగి లెంపకాయ కొడుతుందనుకో. అప్పుడేం జరగాలి?"

"భోరున ఏడుస్తూ మీదపడి కౌగలించుకోవాలండి. అదయిపోయాక పాట పాడొచ్చు."

"బ్యూటీ....సోషల్ పిక్చర్‌లో క్లైయిమాక్సు సీనులో తప్పకుండా రావాల్సిన డైలాగు ఏమిటి?

"తైరో....అండి."

"సెబ్బాస్....అన్నట్టు అబ్బాస్ ఎవరు?"

"'రాహి' సినిమాకి ష్టోరీ రాసినవాడు"

"మళ్ళీ షెబ్బాస్ అంటున్నాను. అని నిన్ను తక్షణం బుక్ చేస్తున్నాను. నేను డిస్ట్రిబ్యూట్ చేసే పిక్చర్లలో మూడింటికి నువ్వే రైటరువి. ష్టోరీలాలోచించు" అన్నాడు లాలారాం.

"విన్నావా. నువ్వంత నేర్పుగా చాకచక్యంగా మాట్లాడి మాట నిలబెట్ట గలవా? రాముడికథ ఎండింగు ముందస్తుగా చెప్పలేమన్న నగ్నసత్యం నీకు తట్టిఉండేదా?" అన్నాడు రైల్వేబైరాగి.

రాజు అడ్డంగా తల తాటించాడు.

"అయితే లాభంలేదు .... ఒక బీడీఇయ్యి" అన్నాడు బైరాగి బాధగా.

తెల్లగా తెల్లవారే వరకు రైలు గూడూరు చేరబోయింది. రాజు కిటికీమీదికి ఒరిగి నిద్రబోతున్నాడు. పట్టశక్యం కానంత ప్రేమ పెల్లుబికిన ప్రియురాలిలాగా చల్లటిగాలి, వరహాలరాజు చెంపలను ప్రగాఢంగా అదుముతున్నట్టు నిమిరి మరీ దూసుకుపోతోంది. రైలింజనులోంచి ఎగిరి వస్తున్న నిప్పురవ్వలు ప్రేయసి నఖక్షతాలలాగా చెంపమీద చురుకు చురుకు మంటున్నాయి.

సదరు సదుపాయాలవల్ల చురుకైన రాజు బుద్ధి, నిద్రలో చిన్న సైజు 'డ్రీంసీక్వేన్సు' తయారు చేసింది. గుర్తు తెలీని హీరోయిన్‌తో, కంఠతాపట్టి కాపీకొట్టిన హిందీ ట్యూనులో డ్యూయెట్ పాడుతూ, టాపులేని హాలులో గొల్ల స్తంభాలాటలా పరుగెడుతున్నాడు రాజు.

మూడు నిముషాలు కాగానే హిందీ ట్యూను అయిపోయినందువల్ల డాన్సు, దానిమూలాని, అ కలా కూడా మెల్లిగా ఫేడౌట్ అయి కరిగి పోయాయి. అక్కడితో రైలుగాలికి చల్లటి, మెత్తటితనం పోయి చలిగాలి గుణం అబ్బినట్టయింది. మెల్లిగా మత్తుగా కళ్లు తెరుద్దామనుకుంటున్నాడు.

తెల్లవారెను, కోడికూసెను, అంటూ మాయామాళవగౌళ రాగంలో బైరాగి పాడుతున్నపాట బాక్ గ్రౌండ్ మ్యూజిక్‌గా అమరింది. బాగుందనుకుని అది పూర్తికావచ్చేదాక ఆగి, కళ్లు తెరిచాడు రాజు.

రైల్వేబైరాగి నవ్వాడు రైల్వేబైరాగిలాగ.

"మీరున్నారా గురూ" అన్నాడు రాజు కొంచెం ఆశ్చర్యపడి.

బైరాగి చిన్న బుచ్చుకున్నాడు.

"ఉండక, పోయేం చేస్తానయా: ఎత్తుకుపోడానికి నీదగ్గరున్నవి ఎత్తెడు న్యూసుపేపర్లేగా" అన్నాడు కాస్తంత ఎత్తిపొడుపుగా.

"రెండు కాశీసీసాలుకూడా ఉన్నాయండి. పాతపేపర్లూ కాశీసీసాలూ బంగారు ఉంగరాల వంటివి. ఆపదలో ఆదుకొనును అని చెప్పాడు వాటివి నాకు వదిలి వేసిన టోకరా రాక్షసుడు'' అన్నాడు రాజు పెంకెగా.

"అయితే నేనూ అలాంటివాడి ననుకున్నావా .... మొహం చూస్తే తెలీటంలే."

''పోతన్న రాసిన ఉప్పు డైలాగు వినలేదా ఏమిటి మీరు. ఉప్పు కప్పురంబు నొక్క పోలికనుండు అని రాశాడులెండి. మీ యిద్దరూ ఒక్క పోలికన ఉంటే బుద్ధులు వేరు వేరనుకోవచ్చు. పోలికలు వేరు కాబట్టి ఇప్పుడు బుద్ధులు ఒకటేనన్నమాట. అతను టోకారా యిచ్చాడు; మీరు యిస్తారు గ్యారంటీ. అందుకే అడిగాను" అన్నాడు రాజు.

రైల్వేబైరాగి కొయ్యబారిపోయి "ఓరి బాబో! ఎంత దారుణమైన సూక్ష్మబుద్ధి. నువ్వు నిజంగా డైరెక్టరు కావలిసిన వాడివి—బాబూ"అన్నాడు.

"ఎవడు చూడొచ్చాడు. అయితే అవనూ అవుతాను. ఇందాక అలా అన్నందుకు కోప్పడకండి. నేను ఇంకా మెడ్రాసేనా చేరకుండా సినిమాపేరు చెప్పి ఒక టోకరా తిన్నాను. అలాటిపే మూడు విన్నాను .... సినిమా యింత డేంజరస్ అనుకోలేదు."

బైరాగి చనువుగా రాజు జేబులో సిగరెట్టు తీసుకొని ముట్టించి గంభీరంగా నవ్వాడు.

"పొరబడుతున్నావు. నీవు టోకరా తిన్నది సినిమావల్ల కాదు. పోతే ఆ నరసన్న సినిమావాడూ కాదు. దొంగలు ఎక్కడేనా ఉంటారు. ఎప్పుడేనా ఉంటారు. వాడు రైలుదొంగ నాకు తెలుసు. బాగుండదు, వాడిమాటికి నేనెందుకు అడ్డురావాలని ఊరుకున్నాను. చూడు, నీలాటి వెర్రిబాగులాడి మొహంచూస్తే దొంగలకి ఎంతో ముచ్చటేస్తుంది. నీక్కావలసిన కబుర్లు చెప్పి, వాళ్ళక్కావలసిన సరుకు తీసుకు చక్కా

పోతారు. అంతేతప్ప, నువ్వు సినిమాలో చేరుతున్నావని తెలిసి ఎవరో స్పెషల్‌డ్యూటీ వేసుకు రాలేదు అని గంభీరంగా ఉపన్యసిస్తున్నాను'' అన్నాడు బైరాగి.

రాజు తలవంచుకుని కిటికీవైపు తల 'పాన్' చేసి అలా శూన్యంలోకి చూస్తూ ఊరుకున్నాడు.

"ఊఁ నువ్వు సినిమాలో చేరతావన్నమాట'' అన్నాడు బైరాగి దగ్గరకి జరిగి.

నువ్వు నువ్వు అనడం రాజుకేం సయించలేదు. 'ఈ వెధవకి అనవసరంగా చనువిచ్చాం. అలుసు తీసుకు నెత్తికెక్కి పోతున్నాడు' అని విసుక్కున్నాడు.

బైరాగి కత్తిలేని జీనియసు. ఈ సంగతి పసిగట్టి, "మీకు ఎవరైనా తెలుసా సార్ ?'' అన్నాడు. రాజు మొహం వికసించింది.

''మాది మెడ్రాసే అసలు. నాకు స్టార్సంతా తెలుసు. వాళ్ళకి ఉత్తరాలు రాశాను. ఇలా ఫలానా రైల్లో వస్తున్నానని. బహుశా నాగయ్య, నాగేశ్వరరావు, రామారావు, బి. ఎన్., కె. వి. (బి. ఎస్. సి. హాన్స్) వస్తారు స్టేషనుకి'' అన్నాడు రాజు.

''అయ్యబాబోయ్'' అన్నాడు బైరాగి ఆశ్చర్యపడి లేచి.

''ఏమనుకున్నావు. నేను అల్లాటప్పా పల్లెటూరు బైతుననుకున్నావా? వాళ్ళేకాదు. ఇంకా ప్రొడ్యూసుడెండ్ డైరెక్టర్‌బై, ప్రింటెడెండ్ పబ్లిషుడు బై ప్రభృతులూ మొదలగు వారుకూడా వస్తారు దండలు పట్టుకుని'' అన్నాడు పుంజుకుని.

బైరాగికి హఠాత్తుగా ఉత్సాహం ఉప్పొంగింది.

"భేష్. సరేగాని మరి వాళ్ల దండలు తేకపోతే''

"తెస్తారు"

"అక్కడే పొరపాటు బడ్డావు. వాళ్లు మాటింగునుంచి హడావుడిగా వచ్చేస్తున్నపుడు దండలు దొరక్కపోతే? మనం సప్లయి చెయ్యాలి. ఇంకోటి నాయనా, వాళ్ళందరూ సినిమావాళ్లగదా? వాళ్లు చూస్తూ ఉండగా నాన్ సినిమావాళ్లు నాలుగైదో రెండు మూడో దండలు వేస్తే గొప్పగా ఉంటుంది. వీడెవడో చాలా గొప్పవాడురోయ్ అనుకుంటారు. లేకపోతే లోకువ కట్టేస్తారు" అన్నాడు.

రాజుకి ఈ ఊహ నచ్చలేదు. "మీరు దండ వేశారనుకోండి. మీ గడ్డంగట్రా చూసి, నన్ను స్వామి వివేకానందస్వామి అనుకున్నారంటే డేంజరు గదా .... బుక్ చెయ్యరు. నిజంగా గొప్పవాణ్ణనుకుని" అన్నాడు రాజు.

"నాయనా తిరిగి పొరబడుతున్నావు సుమా".

"ఇదిగో! రైల్వేబైరాగిగారూ, మీరలా సినిమా డైలాగులా మాట్లాడకండి. నాకు భయం వేస్తుంది. ఇందాక టోకరా యిచ్చినవాడూ ఇలాగే మాట్లాడాడు."

"దానికేం గురూ".

"గురూ అనకండి బాగులేదు."

"పోన్లే తమ్ముడూ నే చెప్పేదేమిటంటే, ఈలోకంలో డబ్బా చాలా ముఖ్యం. అన్నిటికన్నా సొంతడబ్బా బెష్టు. అదిలేపోతే నెత్తిన కానీపెట్టి వేలం వేస్తే దమ్మిడీ పాడదెవడూను .... .... సినిమాలాంటిచోట మరీ అపసరం. 'సొంతడబ్బా ఎంతో ముఖ్యం, అదే తెచ్చును ఎంతో సౌఖ్యం' అన్నాడు."

"ఎవడు?"

“గుర్తులేదు, బహుశా నేనే అని వుంటాను. ఏం? వేయేలగాని, నిన్నుచూస్తే నాకు ఎందుకో దయ కలిగింది. నేను హృషీకేశం పోతున్నాను ఎలాగానూ. పోతూ పోతూ నీకు కాస్త హెల్పుచేద్దామని.... ఒక్క కథ చెబుతా విను ....” అన్నాడు బైరాగి.

రైలు గూడూరులో ఆగింది. “మొహం కడుక్కుని రెండు మాత్తర్లేసుకుని కాస్త కషాయం సేవించి వద్దాంపద. ఆనక స్థిమితంగా చెబుతాను మంచి కథ” అన్నాడు బైరాగి.

గూడూరు రైల్వేహోటలు మాత్తర్లు ఆయనకి సయించలేదు. ఎలాగో అవి తినేసి, కాస్త ఉప్మాకూడా పుచ్చుకుని, కషాయం ఉరఫ్ కాఫీ త్రాగి, బీడీలకట్ట కొనిపించుకుని వచ్చి కూర్చున్నాడు.

“చెప్పండి గురూ” అన్నాడు రాజు ఉత్సాహంగా.

గురువు కథ చెప్పాడు బీడీ ముట్టించి.